క్లుప్తంగా

తహసీల్దార్‌కు వినతి


శ్రీనివాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న రైతులు, నాయకులు

జూలూరుపాడు: పంట పొలాలకు వెళ్లడానికి రహదారి సౌకర్యం కల్పించాలని కోరుతూ సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ శ్రీనివాస్‌ను గుండ్లరేవు గ్రామ రైతులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు, రైతులు మాట్లాడుతూ పంట పొలాలకు వెళ్లడానికి 30 ఏళ్లుగా పాత డొంక నడవడానికి ఇబ్బంది పడుతున్నామని, రోడ్డు నిర్మించాలని కోరారు. కార్యక్రమంలో మాస్‌లైన్ పార్టీ కొత్తగూడెం డివిజన్ కార్యదర్శి జాటోత్ కృష్ణ, మండల కార్యదర్శి బానోత్ ధర్మా, టీయూసీఐ జిల్లా ఉపాధ్యక్షుడు ఏదులాపురం గోపాల్‌రావు, రైతులు మల్కం వెంకటేశ్వర్లు, తెల్లం పాపయ్య, కాలం కోటేశ్వరరావు, వెంకన్న, తెల్లం రాజేశ్వరరావు, మల్కం సతీష్, తెల్లం వెంకటేష్, కృష్ణయ్య, తాటి నరసింహారావు, వెట్టి బాబు పాల్గొన్నారు.

జీసీసీ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ప్రతిపాదనలు

పాల్వంచరూరల్: స్థానిక గిరిజన సహకార సంస్థ (జీసీసీ) స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు జీసీసీ మేనేజర్ నర్సింహారావు కలెక్టర్‌కు ప్రతిపాదనలు పంపారు. జీసీసీ కార్యాలయం సముదాయంలో 4.08 ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఇందులో పెట్రోల్ బంక్‌ను ఏర్పాటు చేయాలని గతంలో కూడా ప్రతిపాదనలు పంపారు. 2019లో హెచ్‌పీఎల్ సంస్థ ద్వారా బంక్ ఏర్పాటుకు అనుమతులు ఇచ్చింది. అప్పటి నుంచి నో అబ్జెక్షన్ సర్టిఫికెట్ కోసం జీసీసీ అధికారులు ప్రయత్నాలు చేసినా సాధ్యం కాలేదు. మరోసారి ఎన్‌ఓసీ కోసం ప్రతిపాదనలు పంపినట్లు మేనేజర్ నర్సింహారావు సోమవారం తెలిపారు. అనుమతులు వస్తే త్వరితగతిన బంక్‌ను ఏర్పాటు చేయాలనే ప్రయత్నంలో ఉన్నట్లు పేర్కొన్నారు.

కేసు నమోదు

పాల్వంచరూరల్: పంట చేనులో మొక్కలు ఎందుకు తొలగించావు అని అడిగినందుకు బూతులు తిట్టి దాడి చేసిన వ్యక్తిపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాలు... మండల పరిధి పుల్లాయిగూడెం గ్రామానికి చెందిన కాచిమల్ల కమలాకర్‌కు చెందిన భూమిలో నాటిన జామాయిల్ మొక్కలను, గెట్టును ఆదివారం అదే గ్రామానికి చెందిన రామారావు మొక్కలను పీకీ గెట్టును ధ్వంసం చేశాడు. ఈ విషయాన్ని అడగడానికి వెళ్లిన తనపై, తన తల్లి కమలపై దాడి చేసి బూతులు తిట్టాడని కమలాకర్ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ.సురేశ్ తెలిపారు.

వెల్డింగ్ షాప్‌లో చోరీ

ఇల్లెందురూరల్: మండలంలోని సుదిమళ్ల గ్రామపంచాయతీ జగదాంబగుంపు గ్రామంలో గంగా వెల్డింగ్ షాపులో సోమవారం చోరీ జరిగింది. ఉదయం షాప్ తెరిచేందుకు వెళ్లిన యజమాని బండ దుర్గాప్రసాద్ షాపు గోడ ఒక మూల కూలినట్లుగా చూసి భారీ వర్షాల కారణంగా కూలినట్లు భావించి తాళం తెరవగానే ఆందోళన చెందాడు. షాప్‌లో విలువైన సామగ్రి కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వెంటనే స్పందించిన పోలీసులు షాపును పరిశీలించి రూ.1.20 లక్షలు విలువ చేసే సామగ్రి చోరీ జరిగినట్లుగా నిర్ధారించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పీహెచ్‌సీ దూరం..
వైద్యం భారం

ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అందరికీ అందుబాటులో ఉంటేనే పేదప్రజలు ఆరోగ్యంగా ఉంటారు. అది కాస్తా సుదూరంలో ఉంటే మెరుగైన వైద్యం పేదవర్గాలకు అందని ద్రాక్షే. ఇటువంటి పరిస్థితిలో ప్రైవేటుకు వెళ్లి జేబులు ఖాళీ చేసుకోక తప్పడం లేదు. మండలంలో రెండు పీహెచ్‌సీలు ఉన్నా కేటాయించిన గ్రామాలకు అవి దూరంగా ఉండటం ప్రజలకు ఆర్థిక ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి.

- ఇబ్బంది పడుతున్న 12వేల మంది జనాభా
- సబ్‌సెంటర్లతో పూర్తిస్థాయిలో అందని ప్రయోజనం

ఇల్లెందురూరల్: మండలంలో కొమరారం, రొంపేడు కేంద్రంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొమరారం పీహెచ్‌సీకి 15 గ్రామ పంచాయతీలు, రొంపేడు పీహెచ్‌సీకి 15 గ్రామపంచాయతీలు, అదనంగా ఇల్లెందు పట్టణం కేటాయించారు. కానీ చల్లసముద్రం ఉమ్మడి పంచాయతీ, మామిడిగుండాల గ్రామపంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు తమకు కేటాయించిన పీహెచ్‌సీకి వెళ్లాలంటే రొంపేడు పీహెచ్‌సీని దాటుకొని మొత్తంగా 25 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. అంతేకాకుండా రొంపేడు పీహెచ్‌సీ నెలకొల్పిన కొమ్ముగూడెం గ్రామపంచాయతీ కూడా కొమరారం పీహెచ్‌సీ పరిధిలోకే వస్తుంది. కొమరారం పీహెచ్‌సీ మాదిరిగా రొంపేడు పీహెచ్‌సీని కూడా 24 గంటల ఆస్పత్రిగా అప్‌గ్రేడ్ చేయడంతోపాటు గ్రామాల కేటాయింపులో దూరభారాన్ని సరిచేస్తే ఇబ్బందులు కొంతైనా తగ్గుతాయని ప్రజలు అభిప్రాయపడుతున్నారు.

సబ్‌సెంటర్లు నామమాత్రమే..

చల్లసముద్రం గ్రామపంచాయతీ కేంద్రంగా సమీపంలోనే ఆరు గ్రామపంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో నిజాంపేట, లచ్చగూడెం, ఒడ్డుగూడెం కేంద్రంగా మాత్రమే సబ్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. ఆయా సబ్‌సెంటర్లలో వైద్యసిబ్బంది ఏ సమయంలో ఉంటారో కూడా తెలియక చాలామంది అత్యవసర సమయాలలో అటుగా చూడటం మానేసి ప్రైవేటు ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు. అంతేకాకుండా సబ్‌సెంటర్లలో వైద్యులను నియమిస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఆ సదుపాయాన్ని ఒడ్డుగూడేనికి మాత్రమే పరిమితం చేసింది. నిజాంపేట, లచ్చగూడెంలలో బీఎస్సీ నర్సింగ్ చేసిన వారికి అవకాశం కల్పించింది. కానీ ఈ మార్పు కూడా ఆరోగ్యపరంగా తమకు ఎటువంటి సహాయం చేయలేకపోతోందని ప్రజలు వాపోతున్నారు. కేవలం ప్రభుత్వ సంబంధిత కార్యక్రమాలైన వ్యాక్సినేషన్, వారానికి రెండు రోజులు డ్రైడే నిర్వహణ, జ్వరాలు ప్రబలితే వైద్యశిబిరాలు నిర్వహించడం గర్భిణులు, బాలింతలు గతం మాదిరిగానే నమోదు చేసుకోవడం, అవసరమైన మందులు అందజేయడం వంటి వాటికే పరిమితమవుతున్నారు. కానీ అత్యవస వైద్యసేవలు సబ్‌సెంటర్లలో అందుబాటులో ఉండవు. అత్యవసరం అనుకుంటే ఇల్లెందు పెద్దాస్పత్రి లేదంటే కొమరారం పీహెచ్‌సీకి వెళ్లడం మినహా వారికి మరోమార్గం లేదు. మరికొందరు స్థానికంగా ప్రైవేటు వైద్యులను ఆశ్రయించి వైద్యసహాయం పొందుతున్నారు. రెండింటిలో ఏది ఎంచుకున్నా ప్రజలకు ఆర్థిక ఇబ్బంది మాత్రం తప్పడం లేదు.

పీహెచ్‌సీ ఏర్పాటుపైనే ఆశ..

చల్లసముద్రం సమీపంలోని ఆరు గ్రామపంచాయతీలలో 12,042 జనాభా ఉంది. వీరికి వైద్యసేవలు అందించేందుకు ప్రత్యేకంగా పీహెచ్‌సీని ఏర్పాటు చేయాలని ఈ ప్రాంత ప్రజలు డిమాండ్ వినిపిస్తోంది. ఎన్నికల సమయంలోనే నేతలు ఈ మేరకు ప్రజలకు హామీలు కూడా గుప్పించారు. అంతేకాకుండా చల్లసముద్రం గ్రామపంచాయతీ కేంద్రంలో గతంలో సబ్‌సెంటర్ ఏర్పాటు కోసం ప్రభుత్వ నిధులతో ఓ భవనం నిర్మించారు. కానీ నేటికీ మంజూరు లేకపోవడంతో ఆ భవనం నిరుపయోగంగా ఉంది. కొద్ది దానిని గ్రంథాలయంగా ఉపయోగించారు. స్థానికుల అభ్యంతరంతో మూసివేశారు. వృథాగా ఉన్న భవనం కేంద్రంగా మినీ ఆస్పత్రి ప్రారంభించి సబ్‌సెంటర్లకు కేటాయించిన వైద్యులలో ఒక్కరినైనా ఇక్కడ నియమిస్తే సబ్‌సెంటర్ల పనితీరు మెరుగుపడటంతోపాటు కొంతమేరకైనా వైద్యసేవలు అందుబాటులోకి వచ్చే అవకాశం ఉందని స్థానికులు అంటున్నారు.


నిరుపయోగంగా చల్లసముద్రంలో సబ్‌సెంటర్

పీహెచ్‌సీ మంజూరు చేయాలి..



ఆరు గ్రామాల పరిధిలో మూడు సబ్‌సెంటర్లు ఉన్నా కేటాయించిన విధులు మినహా అత్యవసర సేవలు అందడం లేదు. జ్వరం తీవ్రమైతే ప్రైవేటు ఆస్పత్రికి వెళ్లాల్సిందే. మెరుగైన వైద్యం అందుబాటులో ఉండేలా చల్లసముద్రంలో పీహెచ్‌సీ మంజూరు చేయాలి.

– సుభద్ర, వేములవాడ

వైద్యం అందుబాటులో ఉండాలి..



25 కిలోమీటర్లు ప్రయాణిస్తే పీహెచ్‌సీ, తొమ్మిది కిలోమీటర్లు అయితే సీహెచ్‌సీ చేరుకుంటాం. అత్యవసర సమయంలో ఇది ఆర్థిక భారమే. స్థానికంగా పీహెచ్‌సీ మంజూరు చేయాలి. లేదంటే చల్లసముద్రం కేంద్రంగా వైద్యులను నియమించి సేవలు అందించాలి.

– అరెం సీత, రేపల్లెవాడ

గణేష్ మండప నిర్మాణాలకు క్రరపూజ


గాంధీనగర్‌లో పూజలో పాల్గొన్న కొత్వాల శ్రీనివాసరావు


మార్కెట్ ఏరియాలో పూజ చేస్తున్న వర్తక సంఘం నాయకులు

పాల్వంచ: గణేష్ నవరాత్రి ఉత్సవాలు వాడవాడలా ఘనంగా నిర్వహించేందుకు మండప నిర్మాణ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. కాగా సోమవారం కార్పొరేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో ఓం గణేష్ మహారాజ్ యూత్ ఆధ్వర్యంలో, మార్కెట్ ఏరియాలో, వర్తక సంఘం ఆధ్వర్యంలో జరగనున్న నవరాత్రి ఉత్సవాల మండప నిర్మాణాలకు ప్రత్యేక క్రరపూజ చేశారు. భక్తుల విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ డైరెక్టర్ కొత్వాల శ్రీనివాసరావు, ముగిది శంకర్, నవీన్, ప్రశాంత్, దుర్గాప్రసాద్, వర్తక సంఘం కన్వీనర్ చలవాది ప్రకాష్, పెండ్యాల కృష్ణమూర్తి, గూడెపు శ్రీనివాస్, ఉప్పల వెంకటేశ్వర్లు, వెంకటేశ్వర్లు, శివ, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఏఈల నామినేషన్లు


నామినేషన్లు అందజేస్తున్న ఏఈలు

పాల్వంచ: జెన్కో పరిధిలోని తెలంగాణ స్టేట్ ఎలక్ట్రిసిటీ అసిస్టెంట్ ఇంజనీర్స్ అసోసియేషన్ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ సోమవారం ముగిసింది. స్థానిక ఇంజనీర్స్ అసోసియేషన్ హాల్‌లో మూడు రోజులుగా నిర్వహిస్తున్న ఇంజనీర్ల ఎన్నికల నామినేషన్లకు చివరి రోజు కేటీపీఎస్ నుంచి టి.మహేష్ జనరల్ సెక్రటరీ పదవికి, జి.శ్రీపాల్ ఫైనాన్స్ సెక్రటరీ పదవికి నామినేషన్ సమర్పించారు. కాగా ఎన్నికలు ఈనెల 30 నిర్వహించి సెప్టెంబర్ 2 ఫలితాలు వెల్లడించనున్నారు. ఇదిలా ఉండగా జెన్కో, ట్రాన్స్‌కో, ఎస్‌పీడీసీఎల్ నుంచి మొత్తం 40 మంది నామినేషన్లు సమర్పించారు. ఈ ప్రక్రియను ఎన్నికల అధికారి రవి పర్యవేక్షించారు.

లంబాడీలపై అనుచిత వ్యాఖ్యలు గర్హణీయం

జూలూరుపాడు: లంబాడీలపై భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదని భారతీయ గోర్ బంజారా పోరాట సమితి ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు బానోత్ దుర్గాప్రసాద్ అన్నారు. సోమవారం ఆయన జూలూరుపాడులో విలేకరులతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి లంబాడీల ఓటర్లు ప్రముఖ పాత్ర పోషించారనే విషయం మరవొద్దన్నారు. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న ఎమ్మెల్యే లంబాడీలను దూషించడం సరైంది కాదన్నారు. ఎమ్మెల్యేపై సీఎం రేవంత్ రెడ్డి తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తండాల గ్రామ పంచాయతీలను రెవెన్యూ గ్రామ పంచాయతీలుగా ఏర్పాటు చేయాలని ప్రభుత్వానికి విన్నవించారు. కార్యక్రమంలో గోర్ బంజారా పోరాట సమితి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సామూహిక సీమంతం


పూలు, పండ్లు అందజేస్తున్న లక్ష్మీప్రసన్న

పాల్వంచరూరల్: మండల పరిధి ఉల్వనూరు బంజర గ్రామంలోని రైతు వేదికలో సోమవారం గర్భిణులకు సీమంతం నిర్వహించారు. కొల్లి ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు కలప్నా చౌదరి జన్మదినం సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీప్రసన్న గర్భిణులకు పూలు, పండ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ మాధవి, పంచాయతీ కార్యదర్శి అనిల్, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

జీఓ 224 పునరుద్ధరించండి..


మంత్రికి వినతిపత్రం అందజేస్తున్న వెంకట్‌గౌడ్

ఇల్లెందు: ఇల్లెందు పట్టణ క్రమబద్ధీకరణ జీఓ 224 పునరుద్ధరణ, ఫారెస్టు గ్రౌండ్‌ను, జేకే–5 ఓసీ స్థలం సుమారు 100 ఎకరాలను పట్టణ అవసరాల కోసం మున్సిపాలిటీకి అప్పగించాలని మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మడత వెంకట్‌గౌడ్ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని కోరారు. ఈ మేరకు సోమవారం ఇల్లెందు పర్యటనకు వచ్చిన ఆయనకు వినతిపత్రం అందజేశారు. వాటిని పరిశీలించిన మంత్రి పొంగులేటి కలెక్టర్ జితేష్ పాటిల్‌కు అప్పగించారు. ఈ సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. అదేవిధంగా సింగరేణి ఓసీ నిర్వాసితులు తమకు న్యాయం చేయాలని మంత్రి పొంగులేటిని కలిసి వినతిపత్రం అందజేశారు. కారేపల్లి జర్నలిస్టులు తమకు కేటాయించిన కోటమైసమ్మ ఆలయం పరిధిలోని భూమిని అప్పగించాలని, సింగరేణి కాంట్రాక్ట్ కార్మికులకు వేతనాలు పెంచాలని కార్మిక సంఘాల జేఏసీ నేతలు మంత్రికి వినతిపత్రాలు అందజేశారు.

అవకతవకలపై విచారణ జరిపించండి..

టేకులపల్లి: 2024 ఫిబ్రవరిలో జరిగిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపించాలని సోమవారం మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిని పీఆర్టీయూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డి.వెంకటేశ్వరరావు, బి.రవి టేకులపల్లి మండలం కోయగూడెంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రంలో అతిపెద్ద సంఘంగా చెప్పుకుంటున్న ఉపాధ్యాయ సంఘం బలపరిచిన ఎమ్మెల్సీ అభ్యర్థికి ప్రతిపక్ష పార్టీ ద్వారా, ఇతర ప్రైవేట్ వ్యక్తుల ద్వారా రూ.కోట్లు అందాయని, వాటితోపాటు విచ్చలవిడిగా మద్యం సరఫరా చేశారని ప్రచారం జరుగుతోందని విచారణ చేపట్టాలని కోరారు.

‘సీఎంకు బీసీలంటే చిన్నచూపు’

జూలూరుపాడు: సీఎం రేవంత్‌రెడ్డికి బీసీలంటే చిన్నచూపని బీఆర్ఎస్ పార్టీ వైరా నియోజకవర్గ నాయకుడు లకావత్ గిరిబాబు అన్నారు. సోమవారం ఆయన జూలూరుపాడులో మాట్లాడుతూ బీసీలపై ఉన్నది కపట ప్రేమేనని, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసమే బీసీ రిజర్వేషన్, ఇతర పథకాలంటూ కాంగ్రెస్ డ్రామాలాడుతోందని విమర్శించారు. అధికారం కోసం సాధ్యం కాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చి వాటిని మరిచారన్నారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలు ఇచ్చి కొలతలు, నిబంధనలంటూ లబ్ధిదారులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ ఎన్నికల హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో చాపలమడుగు రామ్మూర్తి, లకావత్ హేమ్లా, తాళ్లూరి రామారావు, భూక్యా దేవీలాల్, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎస్‌ను రద్దు చేయాలి


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

టేకులపల్లి: సీపీఎస్ స్కీమ్‌ను రద్దు చేయాలని టీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు తేజావత్ రవీందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని ఇందిరా పార్క్ వద్ద సెప్టెంబర్ 1న నిర్వహించనున్న మహాధర్నా వాల్ పోస్టర్లను సోమవారం మండలంలోని ముత్యాలంపాడు ఉన్నత పాఠశాలలో ఆవిష్కరించారు. మాట్లాడుతూ.. ధర్నాను బాధిత ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో టేకులపల్లి మండల అధ్యక్షుడు మోతీలాల్, ప్రధాన కార్యదర్శి రమేష్ బాబు, మండల నాయకులు రమణ, హెచ్ఎం రామ్‌చందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కార్పొరేట్ స్థాయిలో వైద్యసేవలు


ఆస్పత్రిని ప్రారంభిస్తున్న దృశ్యం

టేకులపల్లి: టేకులపల్లి మండలంలోని మారుమూల ఏజెన్సీ ప్రజలు అత్యవసర వైద్యం కోసం కొత్తగూడెం, ఖమ్మం, వరంగల్ వెళ్తుంటారని వారికి అన్ని సదుపాయాలతో ఇక్కడే కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించాలనే సంకల్పం అభినందనీయమని డీసీహెచ్‌ఓ డాక్టర్ రవిబాబు, తాళ్లూరి ట్రస్ట్ చైర్మన్ తాళ్లూరి పంచాక్షరయ్య, వైద్యుడు నాగరాజు అన్నారు. ఈ మేరకు టేకులపల్లిలో నెలకొల్పిన రిమ్స్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రిని సోమవారం వారు ప్రారంభించారు.

వారు మాట్లాడుతూ.. జనరల్ ఫిజీషియన్, జనరల్ సర్జరీ, ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ వైద్య సేవలు అందుబాటులో ఉంటాయని చెప్పారు. ఆస్పత్రి ఎండీలు వినోద్‌రైనా, మౌలానా, వైద్యులు నరేష్‌బాబు, మౌనిక, శంషాద్ బేగం, గ్రామస్తులు ధరావత్ బాలాజీ, ఫూల్‌సింగ్, రవి, నాగేశ్వర్‌రావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీ హక్కులను ఉల్లంఘిస్తున్నారు


వాల్ పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఇల్లెందు: ఈ నెల 24న వరంగల్‌లో నిర్వహించనున్న ఆదివాసీ హక్కుల పోరాట సంఘీభావ వేదిక సభ విజయవంతం కోరుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం ఇల్లెందులోని కొత్త బస్టాండ్ సెంటర్‌లో అంబేద్కర్, కుమురంభీ విగ్రహాల వద్ద వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. నాయకులు మాట్లాడుతూ.. ఆదివాసీలపై ప్రపంచ వ్యాప్తంగా ప్రభుత్వాలు అమానుష హత్యాకాండను కొనసాగిస్తున్నాయని వాపోయారు. హక్కులను ఉల్లంఘిస్తున్నాయని, ప్రశ్నించిన వారి మీద ఉక్కుపాదం మోపుతున్నారని తెలిపారు. దండకారణ్యం ప్రాంతంలో ఖనిజ సంపదను కొల్లగొట్టేందుకు పెట్టుబడిదారులకు అప్పగించే ప్రయత్నాలు సాగుతున్నాయని పేర్కొన్నారు. దీనికి వ్యతిరేకంగా సాగే పోరాటంలో అమాయకులు బలవుతున్నారని, దీనిని నిరసిస్తూ ఈ నెల 24న వరంగల్‌లోని అంబేద్కర్ భవన్‌లో జరగనున్న సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ప్రజాఫ్రంట్ నేత అశోక్, తుడుందెబ్బ జాతీయ కన్వీనర్ రమణాల లక్ష్మయ్య, ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నర్సయ్య, నాయకులు మెంతెన వసంతరావు, సూర్నపాక నాగేశ్వరరావు, మోకాళ్ల రమేష్, ఎట్టి ప్రశాంత్, లక్ష్పతి, వట్టం కన్నయ్య, మంగయ్య, సూర్నపాక రామారావు, రేసు బోసు, ఎన్డీ నేత రాసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సర్దార్ పాపన్నగౌడ్ జయంతి

సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో సోమవారం జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ జయంతి నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జిల్లా అదనపు కలెక్టర్ డి.వేణుగోపాల్ హాజరై పాపన్నగౌడ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మాట్లాడుతూ పాపన్నగౌడ్ జీవిత చరిత్రను ఆదర్శంగా తీసుకుని కులవృత్తులను ప్రోత్సహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన అభివృద్ధి శాఖ అధికారి ఈ.ఇందిర, ఎక్సైజ్ ఎస్‌ఐలు కరంచంద్, కె.గౌతం, ఎం.సరిత, బండి రాజుగౌడ్, ఎల్.రాజయ్యగౌడ్, మోహన్‌గౌడ్, బండి ప్రసాద్ గౌడ్, బత్తుల సురేష్‌గౌడ్, జి.శ్రీనివాస్‌గౌడ్, మాచర్ల శ్రీనివాస్‌గౌడ్, పి.వెంకన్నగౌడ్ పాల్గొన్నారు.

పాల్వంచరూరల్: నాగారం గ్రామంలో సోమవారం సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ 375వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాపన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గౌడ సంఘం అధ్యక్షులు చౌవుగాని నాగేశ్వరరావు, ఉపాధ్యక్షుడు నాగయ్య, గోద చిట్టయ్య, కాటారపు లక్ష్మీనారాయణ, శ్రీను పాల్గొన్నారు.


సూపర్‌బజార్(కొత్తగూడెం): కలెక్టరేట్‌లో..

జూలూరుపాడు: మండల కేంద్రం జూలూరుపాడులో సోమవారం గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడు బండ్ల వెంకటేశ్వర్లు గౌడ్ ఆధ్వర్యంలో బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని ఘనంగా నిర్వహించారు. పాపన్న గౌడ్ చిత్రపటానికి గౌడ సంఘం మండల ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు గౌడ్, నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో రామారావు, పర్సా నాగరాజు, గంధం రాము, కళ్లెం సంపత్, రావుల సాంబ, తదితరులు పాల్గొన్నారు.


ఇల్లెందురూరల్: నివాళులర్పిస్తున్న అధికారులు

ఇల్లెందురూరల్: గోల్కొండ కోటపై యుద్ధాన్ని ప్రకటించిన సాహస వీరుడు సర్దార్ సర్వాయి పాపన్న జయంతిని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి ఎంపీడీఓ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సామాజిక న్యాయం కోసం ఉద్యమించిన ఆయన నేటి తరానికి ఆదర్శవంతుడని కొనియాడారు. కార్యక్రమంలో ఎంపీఓ చిరంజీవి, హౌజింగ్ ఏఈ స్వాతి, సిబ్బంది పాల్గొన్నారు.

టేకులపల్లి: బొమ్మనపల్లిలో సర్దార్ సర్వాయి పాపన్న జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గౌడ సంఘం ఆధ్వర్యంలో సర్దార్ సర్వాయి పాపన్న విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. బుర్ర ధర్మయ్య గౌడ్, బొమ్మెర్ల వరప్రసాద్ మాట్లాడుతూ.. పాపన్న గౌడ స్ఫూర్తి అనుసరణీయమన్నారు. ఈ కార్యక్రమంలో బండి శంకర్, మొగలగాని రాజు, బుర్రి వెంకటేష్, జగదీష్ పాల్గొన్నారు.


జూలూరుపాడులో గౌడ సంఘం నాయకులు


పాల్వంచరూరల్: నాగారంలో...

కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీల ధర్నా


వర్షంలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): ప్రీ ప్రైమరీ, పీఎంశ్రీ విద్యను అంగన్‌వాడీ కేంద్రాలకే అప్పగించాలని, విద్యా బోధన బాధ్యతను అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ఇవ్వాలని తదితర డిమాండ్లతో సీఐటీయూ అనుబంధ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డీడబ్ల్యూఓ స్వర్ణలత లెనీనాకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కె.బ్రహ్మాచారి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా కార్యదర్శి జీ.పద్మ మాట్లాడుతూ అంగన్‌వాడీల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం ఐసీడీఎస్, విద్యారంగాన్ని నిర్వీర్యం చేసేందుకు నూతన జాతీయ విద్యా విధానాన్ని తీసుకొచ్చిందని విమర్శించారు. దీనివల్ల అంగన్‌వాడీ వ్యవస్థ క్రమేపీ రద్దవుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇంగ్లిష్ మీడియం విద్య పేరుతో ఐదేళ్ల లోపు పిల్లలను విద్యాశాఖకు అప్పగించడం సబబు కాదన్నారు. విద్యాబోధన బాధ్యతను అంగన్‌వాడీలకు మాత్రమే ఇవ్వాలని కోరారు. ఆరేళ్లలోపు పిల్లలకు విద్యతోపాటు పౌష్టికాహారం అందిస్తూ మానసిక, శారీరక అభివృద్ధికి 50 సంవత్సరాలుగా పాటుపడుతున్న అంగన్‌వాడీ వ్యవస్థను నిర్వీర్యం చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విధానాన్ని మార్చుకుని అంగన్‌వాడీలకే అదనపు వేతనాన్ని చెల్లించి వారికే అన్ని బాధ్యతలు అప్పగించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా బీఎల్‌ఓ తదితర అదనపు పనులను తప్పించి, విద్యాబోధన మాత్రమే కేటాయించాలని కోరారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్ల పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. 2జీ సెల్‌ఫోన్లు ఇచ్చి యాప్‌లన్నీ అందులో చేయమనడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. నాణ్యతతో కూడిన 5జీ సెల్‌ఫోన్లు ఇవ్వాలని, నెట్, ట్యాబ్‌లు ఇవ్వాలని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షురాలు ఈసం వెంకటమ్మ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కె.సత్య, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా నాయకులు విజయశీల, కళావతి, రాధాకుమారి, భానుశ్రీ, కృష్ణవేణి, హేమలత, సారమ్మ, ఫాతిమ, శైలజ, సావిత్రి, వీరభద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.